| కర్నాటక | అధికారం కోసం నగ్న స్వరూపాన్ని బయట పెట్టుకొన్న బి.జె.పి. |
|---|---|

**2018** మే, జూన్ మాసాల్లో జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి స్వంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యగల మెజారిటీ రాలేదు. 224 సీట్లకు ఎన్నికలు జరుగగా (1 నామినేటెడ్‌తో కలిపి మొత్తం 225 సీట్లు) బిజెపికి 105, కాంగ్రెసుకు 79, జనతాదళ్ (ఎస్)కు 37, బి.ఎస్.పికి-1, స్థానాల్లో గెలిచారు. కాంగ్రెసు, జనతాదళ్‌లు కలిసి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధపడుతున్నట్లు తెలిసికూడ గవర్నరు బి.జె.పి.ని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. యడ్యూరప్ప హడావిడిగా ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు.

దీనిపై దేశవ్యాపితంగా నిరసన వ్యక్తమైంది. కేంద్ర ప్రభుత్వం గవర్నర్ల వ్యవస్థను అడ్డం పెట్టుకొని తనకనుకూలంగా నిర్ణయాలు చేయించుకొంటున్న తీరుపై ప్రజాస్వామిక వాదులంతా గళం విప్పారు. దాంతో 2 రోజుల్లోనే ఎడ్యూరప్ప రాజీనామా చేయక తప్పలేదు.

మరోవైపు కాంగ్రెసు బిజెపిని అధికారంలోకి రాకుండా చేయడానికి మరో గత్యంతరం లేక జెడి(ఎస్)కు తనలో సగం సీట్లు లేనప్పటికీ దాని డిమాండుకు తలొగ్గక తప్పలేదు. ఆరకంగా కుమారస్వామి నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది.

ఆ ప్రభుత్వాన్ని కూల్చడానికి గుంటకాడ నక్క వేచివున్నట్లు ఆతృతగా ఎదురుచూసింది. అధికార పక్షంలోని ఎం.ఎల్.ఏలను బయటికి లాగడానికి బేరసారాలు మొదలెట్టింది. 2019 పార్లమెంటు ఎన్నికలకుముందే ఉమేష్ జాదవ్ అనే కాంగ్రెసు ఎమ్ఎల్ఏను రాజీనామా చేయించి తన పార్టీ అభ్యర్థిగా పార్లమెంటుకు బరిలోకి దింపింది. ఖాళీ అయిన అసెంబ్లీ స్థానానికి ఆయన కొడుకునే ఎం.ఎల్.ఏగా గెలిపించుకుంది.

కర్నాటక పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి ఆధిక్యం రావడం, కేంద్రంలో మంచి మెజారిటీతో కర్నాటకలో తను గద్దెనెక్కాలన్న ప్లానును వేగవంతం చేసింది. అధికారపక్ష ఎంఎల్ఏలను సంతల్లో పశువుల్లా కొనుగోలు చేసింది.

జూలై 1న పరిణామాలు మొదలై ఈనెల 24న కుమారస్వామి విశ్వాస పరీక్షలో ఓడిపోవడంతో ముగిశాయి. 1వ తేదీన ఇద్దరు ఎం.ఎల్.ల రాజీనామాలు, 11 మంది రాజీనామాలపై స్పీకరు పరిశీలనకు పూను కొన్నారు. తనముందు హాజరు కావాలని కోరాడు. 6వ తేదీ రాజీనామా చేసినవారు గవర్నరును కలిసి, నేరుగా విమానంలో బొంబాయికి వెళ్ళి కాంపు పెట్టారు. బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యుని ప్రైవేటు విమానం లోనే వారు పయనించడం- ఆ రాజీనామాలతో మాకు సంబంధం లేదని బిజెపి చేసిన ప్రకటన అబద్ధమని రుజువు చేసింది.

స్పీకరు తమ రాజీనామాలను ఆమోదించ కుండా జాప్యం చేస్తున్నారనీ, అందువల్ల జోక్యం చేసుకొని వాటిని ఆమోదించేలా చేయాలని కోరుతూ 10మంది ఎంఎల్ఏలు సుప్రీంకోర్టు కెక్కారు. తర్వాత మరో 5మంది కూడ వీరితో జత కలిశారు. ఈ ఎం.ఎల్.ఏలు తమ పార్టీల విప్‌లను ధిక్కరించారు గనుక వారిపై అనర్హత వేటు వేయమని కాంగ్రెసు, జెడిఎస్‌లు స్పీకరును కోరాయి. అనర్హత వేటు వేయాలా, రాజీనామాలు ఆమోదించాలా అన్న సందిగ్ధంతో స్పీకరు వుండగా సుప్రీంకోర్టు యథాతథస్థితిని సాగించాలని ఆదేశించింది. పరోక్షంగా బిజెపికే అనుకూలంగా కోర్టు తీర్పు వుందని కాంగ్రెసు విమర్శించింది.

సంకీర్ణ పాలకులు ఈ ఎం.ఎల్.ఏ.లతో సంప్రదింపులు జరిపి బుజ్జగించే చర్యలకు పూనుకొన్నారు. అందులోని వారు కోరు కొంటున్నట్లు మంత్రి పదవులు సర్దుబాటు చేసుకోడానికి కూడ సిద్ధపడ్డారు. ముఖ్యమంత్రి తప్ప మిగిలిన మంత్రులంతా రాజీనామా చేశారు. వారితో మంతనాలు జరపడానికి ముంబైలో హోటల్ వద్దకు వెళ్ళిన శివకుమార్ అనే మంత్రిని ముంబై పోలీసులు అడ్డుకొని వెనక్కు పంపారు. మహారాష్ట్రలో తమకున్న అధికారాన్ని కూడా బిజెపి ఇందుకోసం ఉపయోగించింది. కోర్టు ఆదేశాల ప్రకారం తమ ప్రభుత్వంపై తామే విశ్వాస తీర్మానం పెట్టుకుంది సంకీర్ణ ప్రభుత్వం. నేరుగా ఓటింగు జరపకుండా దానిపై చర్చకు అవకాశం తీసుకున్నది. దీన్ని కూడ సహించలేని గవర్నరు తనకులేని అధికారాన్ని కల్పించుకొని స్పీకరుకు ఓటింగ్ జరిపే సమయాన్ని నిర్దేశిస్తూ రెండు లేఖలు పంపాడు.

ఎంత ప్రయత్నించినా ఎంఎల్ఏలను తమకు అనుకూలంగా తెచ్చుకొనే అవకాశం లేకపోవడంతో చివరకు ఓటింగ్‌కు సిద్ధపడ్డారు. అనుకూలంగా 99, వ్యతిరేకంగా 105 ఓట్లు రావడంతో కుమారస్వామి రాజీనామా చేయడం, యడ్యూరప్పను గవర్నరు ఆహ్వానించడం చకచకా జరిగిపోయాయి.

ఈ అసంతృప్త ఎంఎల్ఏలు తాము ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందన్న ప్రశ్నకు చెప్పిన జవాబు తమ పార్టీలో తమకు మర్యాద, గౌరవం లేకుండా పోయాయని. గౌరవమంటే ఏమిటి? మంత్రిపదవి ఇవ్వక పోవడం.

ఆమాత్రం పదవులు ఎందరికి ఇవ్వ గలుగుతారు ఈ విషయంలో రాజ్యాంగం 91వ రాజ్యాంగ సవరణద్వారా సీలింగు విధించింది. శాసన సభ్యుల్లో మంత్రుల సంఖ్య 15%కు మించరాదని నిర్దేశించింది. 225 మంది ఎంఎల్ఏలున్న కర్నాటకలో 33 మందికి మించి మంత్రిపద వులివ్వలేని పరిస్థితి సంకీర్ణ ప్రభుత్వానిది. మద్దతిచ్చిన స్వతంత్ర ఎంఎల్ఏకి కూడ మంత్రి పదవి ఇచ్చారు.

ఇక్కడ కొట్టొచ్చినట్లు కనిపించే విషయం ఈ అసమ్మతి ఎంఎల్ఏలు తాము గెలిచిన పార్టీలతో సిద్ధాంత రీత్యానో, విధానాల పరంగానో విభేదించి ఈ పనికి పూనుకోలేదు. తాము గెలిచిన నియోజకవర్గాల ప్రజల ప్రయోజనాలు నెరవేర్చడం గురించి వీరికెవరికీ ఆసక్తిలేదు. వుంటే మెజారిటీ కర్నాటక ప్రాంతం భయంకరమైన కరువుకు గురవుతున్న నేపథ్యంలో- విలాస వంతమైన 5స్టార్ హొటళ్ళలో ఎలా బసచేసి విలాసాలననుభవించ గలుగుతారు?

ఆ పార్టీ, ఈ పార్టీ అని తేడా లేకుండా ఇటీవలి కాలంలో పెరిగిన ధోరణి ఏమిటంటే వ్యాపారవేత్తలు ప్రజాప్రతినిధులుగా ముందుకు రావడం డబ్బు వెదజల్లి అధికారంలోకి రావడం, అధికారాన్ని అడ్డంపెట్టుకొని డబ్బు సంపాదించు కోవడం. ఇవి రెండూ కలగలసే ప్రస్తుత రాజకీయ నడుస్తున్నాయి. ఇపుడీ అసంతృప్త ఎంఎల్ఎలకు ఏ రాజకీయ విధానము లేదనీ, స్వప్రయోజనాలే పరమావధి అనీ, ఇందులో అధికులు వ్యాపారవేత్తలేననీ బూర్జువా పత్రికలు కూడ విమర్శించాయి.

70 ఏళ్ళ 'ప్రజాస్వామ్యం'లో చర్చలు జరిగి జరిగి- ఆయారాం గయారాం అన్న చెడు సంస్కృతిని నివారించాలంటే పార్టీల ఫిరాయింపుల నిరోధక చట్టం వుంటే తప్ప వీటికి అడ్డు వేయలేమంటూ దాన్ని తెచ్చి- గొప్ప చట్టం తెచ్చామనీ- ఇకపై ఫిరాయింపులు జరగబోవనీ నమ్మబలికారు.

అన్ని చట్టాలలో కంతలున్నట్లే ఈ చట్టానికీ బోలెడన్ని కంతలు. గుంపుగా ఫిరాయిస్తే చెల్లుతుంది. ఫిరాయించే ఎంఎల్ఏలను అనర్హత వేటు వేసే అధికారం స్పీకరుకిచ్చింది చట్టం. అయితే స్పీకరు అధికారపక్షంవాడు గనుక ప్రతిపక్షంనుండి అధికారపక్షంలోకి వస్తే ఆ ఫిరాయింపుపై స్పీకరు ఏ చర్యా తీసుకోడు. దీనికి దృష్టాంతాలెన్నో. ఈ విషయాలు అవకాశ వాదంగా వ్యవహరించని పాలకపార్టీ లేదంటే అతిశయోక్తి కాదు.

హిందుత్వ ఎజెండాతో మతరాజ్యంగా ప్రకటించే లక్ష్యంతో కూరుకుపోతున్న బిజెపి దక్షిణాదిలో తనకు అవకాశమున్న ఏకైక రాష్ట్రమైన కర్నాటకలో అధికారం కోసం తొక్కని అడ్డదారి లేదంటే అతిశయోక్తి కాదు. గవర్నర్ల వ్యవస్థ, కోర్టులు, రాజ్యాంగేతర పద్ధతులు అన్నిటినీ ప్రయోగించాలి. గతంలో తనకు లొంగనివారిపై ఇన్‌కంటాక్సు, ఇడిలాంటి ప్రభుత్వ శాఖల్ని ప్రయోగించి ప్రతిపక్షంలోని వారిని బెదిరించిందని కాంగ్రెసును ఆక్షేపించిన బిజెపి ఇపుడు మరింత దూకుడుగా అన్ని ప్రభుత్వ యంత్రాంగాల్ని తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొంటోంది.

తనే విధించుకొన్న నిబంధనగా 75సం॥కు మించినవారిని కీలక పదవులకు అవకాశం ఇవ్వగూడదని నిర్ణయించుకొన్నట్లు చెప్పుకుంటోంది. ఇపుడు కర్నాటకలో ఈ నిబంధన ప్రకారమైతే యడ్యూరప్ప అనర్హుడు కావాలి. అయినా కర్నాటకలో ఆర్థికంగా, సాంఘికంగా బలమైన వర్గమైన లింగాయత్‌లకు ప్రతినిధిగా వున్న యడ్యూరప్పకు అవకాశం ఇవ్వకపోతే ఆ వర్గపు మద్దతు కోల్పోయే ప్రమాదముందని భావించి బిజెపి ఈ నిబంధనను కూడ తుంగలో తొక్కింది. గొప్ప ప్రజాస్వామ్య దేశంగా – తాము దానికి పరిరక్షకులుగా చెప్పుకొంటూనే గతంలో కాంగ్రెసు పాలకులు బూర్జువా ప్రజాస్వామిక సూత్రాలను కూడ గాలికొదిలేసి అనేక రాష్ట్రాల ప్రజాతీర్పులను వమ్ము చేస్తూ తమకిష్టం వచ్చినట్లు ప్రభుత్వాలనేర్పాటు చేశారు. దానికంటే కూడ బరితెగించి అన్ని సూత్రాలను గాలికొదిలేసి అధికారసాధనే పరమావధిగా బిజెపి తన నగ్న స్వరూపాన్ని ప్రదర్శించుకుంటోంది.

ఎన్నికల వ్యవస్థలు దామాషా పద్ధతిన ప్రతినిధులను ఎంచుకోవడం, ప్రజాప్రతినిధులను వెనక్కి పిలవడం (రీకాల్) వంటి సంస్కరణలు రావాలని ఎంతోకాలంగా బూర్జువా ప్రజాతంత్ర వాదులనుండి కూడ డిమాండు వుంది. నీతిబాహ్యమైన రాజకీయాలు నెరపుతున్న, అన్ని విలువలను తుంగలోతొక్కుతున్న పాలకవర్గాల కుహనా రాజకీయ విధానాన్ని ప్రజలమధ్య బట్టబయలు చేసి ప్రజాస్వామిక, విప్లవ చైతన్యాన్ని పెంచడమే విప్లవకారుల కర్తవ్యం.

ంంంం